# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

సంచిక : 54 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మే | శనివారం | 24-5-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను
తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం

ప్రపంచానికి మన సత్తాను చాటగలిగాం
ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తి లేదు
ఢిల్లీలో బీఎస్ఎఫ్ కార్యక్రమంలో అమిత్ షా

**న్యూఢిల్లీ మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పడమే గాకుండా, భారత సైనిక శక్తి పాటవాన్నిప్రపంచానికి తెలియ చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్

-మిగతా 2 లో

## మోడీని 50 సార్లైనా
# కలుస్తాం



- రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధానిని కలుస్తూనే ఉంటా
- కేసీఆర్ తన 40 ఏళ్ల అనుభవాన్ని అభివృద్ధికి కేటాయించాలి
- నిమ్జ్ భూ బాధితులకు న్యాయం చేస్తాం
- వారికి పరిహారం న్యాయం చేసే బాధ్యత జగ్గారెడ్డిదే
- జహీరాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి



**సంగారెడ్డి, మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఎన్నిసార్లయినా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు.

-మిగతా 2 లో

## ఏనుగులా
# కాళేశ్వరం ప్రాజెక్ట్

### పునాదులు లేకుండా కట్టిన ఏకైక నిర్మాణం



- కమిషన్ నోటీసులు ఇస్తే విపరీత వ్యాఖ్యలా
- తప్పు చేయకుంటే విచారణ రావాలి
- బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ వేశామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. తప్పు చేయకుంటే నోటీసులు ఇచ్చినప్పుడు హాజరు కాకుండా అనవసర వాదనలు ఎందుకని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ తప్పు చేయకుంటే నోటీసు ఇవ్వగానే అంత ఉలుకు ఎందుకని

-మిగతా 2 లో



## కవిత లేఖపై స్పందించాల్సిన
# అవసరం లేదు

- డాడీ..డాటర్ వ్యవహారంతో మాకేం పని
- కుటుంబ పార్టీలతో దేశానికి నష్టం: కిషన్ రెడ్డి

**హైదరాబాద్,** కెసిఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ పూర్తి అంతర్గత విషయం అని.. దానికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఓ మునిగిపోతున్న నావ అని అన్న ఆయన.. అలాంటి పార్టీలో ఇలాంటి ఘటనలు జరగడం మామూలే అని పేర్కొన్నారు. డాడీ-డాటర్ ఉత్తరం ఓ డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత ఎందుకు ఉత్తరం రాశారు తనకు తెలియదని.. కానీ, కెసిఆర్, కవితల

-మిగతా 2 లో



## ఉగ్రవాదుల తరహాలో
# పాక్ భారత్‌కు హెచ్చరికలు

- మరోమారు నోరు పారేసుకున్న పాక్ సైన్యం
- సింధూ నీటిని ఆపేస్తే.. ఊపిరి నిలిపేస్తామంటూ ప్రేలాపనలు
- పాక్ ఆర్మీ ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తాజా వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్,మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** భారత్‌ను ఉగ్రవాదులు ఎలా రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారో.. అదే తరహాలో పాక్ మిలటరీ అధికారులు సైతం వ్యాఖ్యలు చేస్తున్నారు. ఉగ్రవాదుల భాషనే అక్కడి సైనికాధికారులు ఉపయోగిస్తున్నారు. తాజాగా పాకిస్థాన్ మిలటరీ ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్

-మిగతా 2 లో




## ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచితంగా
# సోలార్ ఏర్పాటు

- క్లీన్ ఎనర్జీకి సహకరించాలని కేంద్రమంత్రికి వినతి
- కేంద్రమంత్రి జోషితో చర్చించిన చంద్రబాబు
- ట్విట్టర్ ద్వారా వివరాలు వెల్లడించిన సీఎం

**న్యూఢిల్లీ,మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. కేంద్రమంత్రులతో సీఎం వరుసగా భేటీలు అవుతున్నారు. శుక్రవారం ఉదయం న్యూ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం స్పందించారు. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశం సంతృప్తిని ఇచ్చిందన్నారు. పీఎం సూర్యఘర్ ముక్తి బిజిలి యోజన రూఫ్ టాప్ సోలార్ కెపాసిటీ- అలోకేషన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. 20 లక్షల ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచితంగా సోలార్ ఏర్పాటు లక్ష్యాన్ని

-మిగతా 2 లో



# తెలంగాణలో కరోనా కలకలం

- మళ్లీ జడలు విప్పుతున్న కరోనా
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేసుల నమోదు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక

**విజయవాడ/హైదరాబాద్,మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** యావత్ ప్రపంచాన్నీ వైరస్‌తో వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ జడలు విప్పుతోన్న సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత నాలుగు రోజులుగా అక్కడక్కడా కరోనా మాట వినిపిస్తున్న

-మిగతా 2 లో

## మిస్ వరల్డ్ పోటీల్లో
# హెడ్ టు హెడ్ ఛాలెంజ్

### సామాజిక సమస్యలపై స్పందించిన అందాల భామలు




**హైదరాబాద్,మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** 72వ మిస్ వరల్డ్ పోటీల్లో కీలక భాగమైన హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్ హైదరాబాద్‌లోని హోటల్ ట్రైడెంట్‌లో అట్టహాసంగా జరిగింది. ఆఫ్రికా, ఆసియా, ఓషియానియా, అమెరికా, కరేబియన్ నుంచి ఐదుగురు చొప్పున మొత్తం ఇరవై మంది అందగత్తెలు సామాజిక సమస్యలపై తమదైన శైలిలో స్పందించారు. తమ వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టు-కున్నారు. ఇక,

-మిగతా 2 లో

## యథావిధిగా డీఎస్సీ, టెట్ పరీక్షలు

### షెడ్యూల్ వాయిదాను తిరస్కరించిన సుప్రీం



**న్యూఢిల్లీ, మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ, టెట్‌కు లైన్ క్లియర్ అయింది. ఇప్పటికే విడుదలైన డీఎస్సీ షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. టెట్, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ వాయిదా వేయాలని కోరుతూ ఆరుగురు అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో సరైన కారణాలు లేవని అభిప్రాయపడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఏవైనా సమస్యలు ఉంటే హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేయాలని జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం సూచించింది. టెట్, డీఎస్సీ షెడ్యూల్

-మిగతా 2 లో

# మోడీని 50 సార్లైనా కలుస్తాం

(మొదటి పేజి తరువాయి)

ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టు కుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సింగూరు ప్రాజెక్ట్‌ను ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామన్నారు. సింగూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులను అప్పులబాధ నుంచి తప్పించామని.. రైతు భరోసా పథకం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేసేందుకు కంకణం కట్టు-కున్నామని స్పష్టం చేశారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడితే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాదని సిఎం రేవంత్ వెల్లడించారు. గత ప్రభుత్వ నేత అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారంటూ విమర్శించారు. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామని అన్నారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలని... సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు-కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు- వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటు-న్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు...ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. ఇఐఊర, ఇఉర, కఒః, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాంఅని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# ఏనుగులా కాళేశ్వరం ప్రాజెక్ట్

(మొదటి పేజి తరువాయి)

ప్రశ్నించారు. నోటీసు ఇవ్వగానే కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమన్న ఉత్తమ్.. ఇందిరగాంధీ లాంటి వాళ్లే కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చాక జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకే జ్యుడీషియల్ కమిషన్ వేశామన్నారు. బాంబులు వేశారని చెబుతున్నారు.. అప్పుడు మీరే ప్రభుత్వంలో ఉన్నారు. మేడిగడ్డపై బాంబులు వేస్తే అప్పుడు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు పేర్కొనలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తెల్ల ఏనుగుతో పోల్చుతూ కాగ్ నివేదికలో పేర్కొంది. భారాస నేతలు జేబులు నింపుకొనేందుకు మేడిగడ్డ ప్రాజెక్టు ప్రాంతం మార్చారు. డీపీఆర్‌లో పేర్కొన్న ప్రదేశం కాకుండా మరోచోట ప్రాజెక్టు కట్టారు. నాలుగు రెట్లు- వ్యయం పెరిగిన ప్రాజెక్టుతో అదనపు ఆయకట్టు- నామమాత్రంగా పెరిగింది. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు ప్రాంతం మార్చారు. కాళేశ్వరం తెల్ల ఏనుగుగా మారబోతోందని కేంద్ర సంస్థలు చెప్పాయి. భారాస ఎంపీల మద్దతుతోనే ఎన్డీఎస్ఏ చట్టం వచ్చింది. కాళేశ్వరం డీపీఆర్, రీడిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఎన్డీఎస్ఏ చెప్పింది. ప్రాజెక్టును పునఃవినియోగంలోకి తేవడంపై మేం చాలా అధ్యయనం చేస్తున్నాం. ప్రాజెక్టు పునాదుల్లోనే ఎన్నో లోపాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కూలిపోయిన ప్రాజెక్టును అద్భుతమని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. జ్యుడీషియల్ కమిషన్ ముందు హాజరై వాళ్ల వాదన ఏంటో వినిపించాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

# ఉగ్రవాదుల తరహాలో పాక్ భారత్‌కు హెచ్చరికలు

(మొదటి పేజి తరువాయి)

అహ్మద్ షరీఫ్ చౌదరి అదే రీతిలో వ్యవహరించారు. భారత్‌పై ఆగ్రహాన్ని ఆయన తన మాటల్లో వ్యక్తపరిచారు. గురువారం పాకిస్థాన్‌లోని ఒక యూనివర్సిటీలో అహ్మద్ షరీఫ్ చౌదరి ప్రసంగిస్తూ.. మీరు మా నీటిని నిలిపి వేస్తే.. మేము మీ ఊపిరిని ఆపేస్తామంటూ భారత్‌కు వ్యతిరేకంగా కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలు దాదాపుగా లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్ చేసిన వ్యాఖ్యలను పోలి ఉన్నాయి. పాక్ మిలటరీ ప్రతినిధి చేసిన ఈ వ్యాఖ్యలు భారత్‌ను బెదిరించినట్లుగా ఉందనే ఓ చర్చ సైతం సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయాల్లో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ఒకటి. ఈ నిర్ణయం తీసుకున్న అనంతరం ఇదే రీతిలో దాదాపుగా ఇదే తరహాలో లష్కరే తోయిబా చీఫ్ స్పందించిన విషయం విదితమే. పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకే పాకిస్థాన్ మిలటరీ ప్రతినిధి అహ్మద్ షరీఫ్ చౌదరి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాదితో చేసుకున్న సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయాలని న్యూఢిల్లీ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. దీనిపై పాక్ నేతలు స్పందిస్తూ పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాకిస్థాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి మాట్లాడుతూ భారత్‌పై ప్రేలాపనలు పేలారు. పాక్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అహ్మద్ షరీఫ్ ప్రసంగిస్తూ..'భారత్ మాకు వచ్చే నీటిని అడ్డుకుంటే అక్కడి ప్రజల ఊపిరి ఆపేస్తాం. సింధూ నదిలో జలాలకు బదులుగా వారి రక్తం పారుతుంది' అని అన్నారు. ఆయన వ్యాఖ్యలను అఫ్ఘాన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మరియం సోలైమాంఖిల్ తీవ్రంగా ఖండించారు. దేశానికి చెందిన ఓ సైనికాధికారి ఇలా మాట్లాడటం సరైన చర్య కాదని అన్నారు. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ సింధూ నది గురించి మాట్లాడుతూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అన్నారు. 'కశ్మీర్‌లో డ్యాం నిర్మించడం ద్వారా పాక్‌కు నీళ్లు ఆపేస్తామని మీరంటున్నారు. పాక్‌ను నాశనం చేయాలని, చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా ప్రణాళికలను విఫలం చేయాలని కోరుకుంటున్నారు. కానీ మీరు నీళ్లు ఆపేస్తే.. నదుల్లో మళ్లీ రక్తం పారుతుంది' అని అతడు అన్నాడని గుర్తు చేశారు. పాక్ అధికారులు అక్కడి ఉగ్రవాదుల స్క్రిప్ట్‌ను చదువుతున్నట్లు ఉందని పేర్కొన్నారు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో కరోనా కలకలం

(మొదటి పేజి తరువాయి)

సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. అయితే, తాజాగా తెలంగాణలో కరోనా కేసు నమోదు నమోదైంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక డాక్టర్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపోతే కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు కరోనా సోకినట్లు- రిమ్స్ వైద్యులు తేల్చారు. వృద్ధురాలికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇక కడప జిల్లాలో మరోసారి మొదటిగా ఒక కరోనా కేసు వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిన్న విశాఖలో ఓ మహిళకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఏపీలో ఇప్పటి వరకు రెండు కరోనా కేసులు నమోదు అయ్యాయి. విశాఖలో వివాహితకు కరోనా పాజిటివ్ అని తేలింది. మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివాహిత చలి జ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు-ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కోవిడ్ 19గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య శాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా అది కూడా పాజిటివ్ గానే నిర్ధారణ అయ్యింది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దెలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వివాహిత కుటుంబ సభ్యులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు పంపించారు. వారందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కాగా.. ఇప్పటికే ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కరోనాకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గ్రూప్‌గా ఉన్న చోట తిరగవద్దు అంటూ పలు ఆదేశాలను ఈనెల 21నే వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చింది.ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు కచ్చితంగా వాడాలని పేర్కొంది. అలాగే చలి జ్వరం , దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి-వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాల నొప్పులు, బాడీ పెయిన్స్, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు , బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఏపీ ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం

(మొదటి పేజి తరువాయి)

ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రయిక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది. ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రయిక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తరవాత తగిన గుణపాఠం చెబుతామని ప్రదాని బీహార్‌లో ప్రకటించారని, అందుకు అనుగుణంగానే ఉగ్ర శిబిరాలపై దాడి చేశామని అన్నారు. కానీ పాక్ మాత్రం జనావాసాలు, విమాన స్థావరాలపై దాడులకు తెగించిందని అన్నారు. వాటిని మన రక్షణ దళాలు సమర్థంగా తిప్పికొట్టడమే గాకుండా పాక్ కోలుకోలేని విధంగా జవాబిచ్చామని అమిత్ షా అన్నారు.

## కవిత లేఖపై స్పందించాల్సిన అసవరం లేదు

(మొదటి పేజి తరువాయి)

మధ్య మాటలు లేవని ఉత్తరం ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.

కుటుంబ పార్టీలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. కెసిఆర్ సొంతపార్టీ ఎమ్మెల్యేలనే దగ్గరకు రానివ్వరని కిషన్ రెడ్డి తెలిపారు. 14 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తనకే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. కేంద్రమంత్రి అయ్యాక కూడా కెసిఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు. పార్టీ కేడర్‌ను కెసిఆర్ కలవట్లేదని స్వయంగా కవిత తనతో చెప్పిందని, బిఆర్ఎస్ పార్టీ డాడీ, డాటర్, సన్, సన్-ఇన్ లా.. పార్టీ అని విమర్శించారు.ఇకపోతే సైనికులను కించపరిచేలా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని, దేశం ప్రశాంతంగా ఉందంటే సైనికులే కారణమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..2018 ఎన్నికలప్పుడే బిఆర్ఎస్ పొత్తు అంటే వ్యతిరేకించామని, రాజకీయంగా మమ్మల్ని తిట్టండి, సైనికులను కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్జికల్ స్ట్రైక్ పై మాజీ సిఎం కెసిఆర్, కవిత ఆధారాలు అడిగారని అదే తరహాలో ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే మేడిగడ్డపై సీబీఐ విచారణ చేయిస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. బీటలు వారుతున్న పరిస్థితిలో కాంగ్రెస్ కు తెలివి వచ్చిందని.. సీబీఐ విచారణకు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడుగా తాను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పార్టీలు ప్రజల కొంపలు ముంచుతాయన్నారు. ఆ ఉత్తరం ఓ డ్రామా.. డాడీ డాటర్‌ల మధ్య మాటలు లేవని ఇప్పుడే తెలిసిందన్నారు.

## మిస్ వరల్డ్ పోటీల్లో హెడ్ టు హెడ్ ఛాలెంజ్

(మొదటి పేజి తరువాయి)

ఈ పోటీ-ల్లో గెలిచిన వారిని కాంటినెంట్ టాప్ 10కి ఎంపిక చేశారు. బ్రెజిల్, సురినామ్, కేమెన్ ఐలాండ్స్, గయానా, ట్రినిడాడ్ , టొబాగో నుంచి వచ్చిన పోటీ-దారులకు.. 'హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత తెలంగాణలో మహిళల భద్రత, సాధికారతపై ప్రపంచానికి మీరు ఏ సందేశాన్ని ఇస్తారు..' అనే ప్రశ్న అడిగారు. ఇందుకు మిస్ గయానా సమాధానం ఇస్తూ.. 'మహిళలు ఎక్కడి-కై-నా వెళ్ళగలరు. భద్రత అనేది హక్కు. మహిళలు స్వేచ్ఛగా జీవించడానికి తెలంగాణ అనువైన ప్రదేశం' అని ప్రశంసించారు. కాంటినెంట్ తుది రౌండ్ విజేతగా నిలిచిన మిస్ ట్రినిడాడ్ ,టొబాగో మాట్లాడుతూ.. 'ప్రగతి, సాధికారత ఒకటే. ఈ రెండిటిపై తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటు-న్న చర్యలు అభినందనీయం. సగం జనాభా వెనుకబడి ఉంటే విజయం సాధించలేము. మరీ ముఖ్యంగా మహిళలను ముందుకు నడిపిస్తున్న తెలంగాణకు ధన్యవాదాలు' అని ఆమె అన్నారు. అందగత్తెలు మహిళా సాధికారత విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని ప్రశంసించారు.

## యధావిధిగా డిఎస్సీ, టెట్ పరీక్షలు

(మొదటి పేజి తరువాయి)

యథావిధిగా కొనసాగుతుందని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ జారీ చేసింది. జూన్ 6 నుంచి జులై 6 వరకు సీబీటీ- విధానంలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచితంగా సోలార్ ఏర్పాటు

(మొదటి పేజి తరువాయి)

సాధించేందుకు సహకరించాలని కోరామన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీసీలకు పదివేల రూపాయల వరకూ సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్‌లో సోలార్ ప్యానల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు- వెల్లడించామని చెప్పారు. కేంద్ర సహకారంతో విద్యుత్తు ధరలు తగ్గించడంతో పాటు- క్లీన్ ఎనర్జీకి తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించినట్లు- చంద్రబాబు ట్వీట్ చేశారు. కాగా.. ఉదయం కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం చంద్రబాబు కలిశారు. ఈ సందర్భంగా పీఎం సూర్య ఘర్ యోజన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ కేటాయింపులు ఇవ్వాలని సీఎం కోరారు. హరిత ఇంధనాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్య కేటాయింపుల కోసం ఓ ప్రతిపాదనను సమర్పించారు. 2025 జనవరిలో ఏపీడిస్కంలు సమర్పించిన ప్రతిపాదనకు త్వరితగతిన ఆమోదం తెలపాలని కేంద్రాన్ని కోరారు. ఈ ప్రతిపాదన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లు లభిస్తాయని. అలాగే బీసీ గృహాలకు కిలోవాట్‌కు రూ.10,000 చొప్పున 2 కిలోవాట్ల వరకు అమర్చుకునేలా సబ్సిడీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. రాష్ట్ర క్లీన్ ఎనర్జీ పాలసీ 2024-29 లో భాగంగా అదనంగా 72.6 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని, ఇందులో 40 గిగావాట్ల సౌరశక్తిని లక్ష్యంగా పెట్టు-కుందని.. ఇది సామాన్యులకు కూడా సౌరశక్తిని అందుబాటు-లోకి తీసుకు వస్తుందన్నారు.

## 2025 మే 24, శనివారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
మాసం: వైశాఖమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం
తిథి
ద్వాదశి: మే 24, తెల్లవారుజామున 1:01 నుండి మే 25, తెల్లవారుజామున 12:02 వరకు
నక్షత్రం
రేవతి: మే 24, సాయంత్రం 4:04 వరకు
అశ్విని: మే 24, సాయంత్రం 4:04 నుండి మే 25, సాయంత్రం 4:12 వరకు
సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:45
సూర్యాస్తమయం: సాయంత్రం 6:40
చంద్రోదయం -చంద్రాస్తమయం
చంద్రోదయం: ఉదయం 3:06
చంద్రాస్తమయం: మధ్యాహ్నం 3:26
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:10 నుండి 4:58 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:46 నుండి 12:38 వరకు
అమృతకాలం: ఉదయం 10:52 నుండి 12:28 వరకు
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 9:05 నుండి 10:42 వరకు
యమగండం: మధ్యాహ్నం 1:56 నుండి 3:33 వరకు
గులిక కాలం: ఉదయం 6:28 నుండి 8:05 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 6:28 నుండి 7:19 వరకు
మధ్యాహ్నం 12:38 నుండి 1:30 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 2:26 నుండి 4:02 వరకు

## జిల్లాలో ప్రతి విద్యార్థి మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యా బోధన జరగాలి

### -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):**
ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి సబ్జెక్టులో ప్రావీణ్యత మెరుగు పరుచుకునేందుకు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలకు లెక్కలు సులువుగా అర్థమయ్యే విధంగా ఏ విధంగా బోధించాలి అనే అంశంపై లెక్కల మాస్టర్లకు మరో ఉపాధ్యాయుడు బోధిస్తుండగా కలెక్టర్ సైతం తరగతి గదిలో కూర్చొని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థిని సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఆ విద్యార్థి పదవ తరగతిలో ఫెయిల్ అయితే ఉపాధ్యాయుడు ఫెయిల్ అయినట్లేనని భావించాలని తెలిపారు. ఈసారి పాఠశాలలో ఏ సబ్జెక్టులో అయితే విద్యార్థులు ఫెయిల్ అవుతారో అట్టి ఉపాధ్యాయుని పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. వనపర్తి జిల్లాలో పదవ తరగతిలో మెథమటిక్స్ లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారని అందువల్ల మ్యాథమెటిక్ ఉపాధ్యాయులు బోధన పై ప్రత్యేక దృష్టి సారించాలనీ సూచించారు విద్యార్థులకు లెక్కలు అర్థమయ్యే విధంగా బోధించాలని విద్యార్థికి లెక్కలు బాగా అర్థమైతే మరే సబ్జెక్టులోను ఫెయిల్ కాదని తెలియజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు చాలా ఉత్తమ ఉపాధ్యాయులు ఉంటారని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. చేయాల్సింది కేవలం పాఠశాలలో విద్యార్థులకు అంకిత భావంతో బాధ్యతగా బోధించడమే అని గట్టిగా చెప్పారు. జిల్లా విద్యా అధికారి మహమ్మద్ ఘనీ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలుసుకున్న షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ..



**షాద్ నగర్, మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) గా బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీబీ తన పరిచయాన్ని చేసుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రాంతంలో ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమైన పోలీసు శాఖ తరపున సత్వర సేవలు అందజేయాలని సూచించారు..

## రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి!




**మాడుగుల మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాడుగుల మండల వ్యవసాయ అధికారి డీ. అరుణ కుమారి రైతులకు కీలక సూచనలు ఇచ్చారు. ఆమె ప్రకటన మేరకు, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి. ఈ ప్రక్రియ ద్వారా ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందవచ్చు, దీని ద్వారా పిఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిని పొందేందుకు అవకాశం లభిస్తుంది. తాజా పిఎం కిసాన్ ఇన్స్టాల్మెంట్ పొందేందుకు ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరి.కావున, రైతులందరూ తమ పటాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, అలాగే ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ తీసుకుని సమీప రైతు వేదిక వద్ద నమోదు చేసుకోవాలి. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, ప్రభుత్వ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని డీ. అరుణ కుమారి రైతులకు విజ్ఞప్తి చేశారు.

## సిపిఐ 23వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

### – సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి



**కరీంనగర్, మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మహాసభ కరపత్రాన్ని ఈరోజు బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్లో ఆవిర్భవించిందని బ్రిటిష్ వలసవాదుల నుండి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని స్వాతంత్రోద్యమంలో పాల్గొని కీలక భూమిక పోషించిన పార్టీ సిపిఐ అని దేశం కోసం దేశ ప్రజల కోసం జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపిందని పెట్టుబడిదారి విధానానికి, దోపిడీకి,శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక కర్షక ప్రజా శ్రేయస్సు కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిన ఘనమైన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. దున్నేవాడికే భూమి కావాలని భూమి కోసం భక్తి కోసంవెట్టి చాకిరి,విముక్తి కోసం, బానిసత్వం పోవాలని విరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాట రహితంగానికి సిపిఐ నాయకత్వం వహించిందని 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిన పార్టీ అని 4,500 మంది అమరవీరుల ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. మహాసభలు ఈనెల 27వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు కరీంనగర్ లోని మధు గార్డెన్ ఫంక్షన్ హాల్లో ప్రారంభమవుతాయని ఈ యొక్క ప్రారంభానికి లిసిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ లు హాజరవుతారని అన్నారు. ఈనెల 27, 28 తేదీలలో జరిగే మహాసభల్లో 300 మంది జిల్లాలో ఎంపిక కాబడ్డ ప్రతినిధులు పాల్గొంటారని ఈసభలలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలు నిర్వహించేందుకు రెండు రోజులపాటు సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిస్తారని మహాసభల జయప్రదం కి కార్యకర్తలుకృషి చేయాలని కసిరెడ్డి సురేందర్ రెడ్డి కోరారు. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శిలు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కోశాధికారి బీర్ల పద్మ జిల్లా కౌన్సిల్ సభ్యులు నలవాల సదానందం, గామినేని సత్యం,తంగెళ్ల సంపత్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఏక్త యాత్ర" ను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ, బిజెపి శ్రేణులకు ధన్యవాదాలు...

### –బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ...



**కరీంనగర్, మే 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హనుమాన్ జయంతి రోజున కేంద్ర మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన " హిందూ ఏక్తాయాత్ర " ను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ, బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్లో 12 సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన హిందూ ఏక్తా యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు , ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ పట్టణంలో అత్యంత వైభవంగా హిందూ ఏక్తాయాత్ర నేడు హిందువుల సంఘటితశక్తి కి దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. 22న హనుమాన్ జయంతి రోజున హిందూ ఏక్తాయాత్ర ఎంతో వైభవంగా జరిగిందని , వర్షాన్ని లెక్కచేయకుండా అశేష సంఖ్యలో తరలివచ్చిన హిందూ బంధువుల రాకతో ఏక్తా యాత్ర గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు.,రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా ఈ యాత్రలో పాల్గొన్నారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. యాత్ర విజయవంతం కోసం కృషిచేసిన బిజెపి నాయకులు కార్యకర్తలు అందరికీ యాత్రకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఈ నెల 26న తలకొండపల్లికి ఉపముఖ్యమంత్రి రాక

### –కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.



**ఆమనగల్లు, మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కరానికి కొత్తగా 8 విద్యుత్ ఉప కేంద్రాలు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని మానస గార్డెన్లో శుక్రవారం రాష్ట్ర పీసీబీ సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, వివిధ మండలాల నాయకులతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు, వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నియోజవర్గానికి కొత్తగా 8 విద్యుత్ ఉపకేంద్రాలు, 300 ట్రాన్స్ఫార్మర్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించడానికి ఈ నెల 26 మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రివర్యులు బట్టి విక్రమార్క తలకొండపల్లి మండలం ఖానాపూర్కు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం అనంతరం దాదాపు 5వేల నుంచి 6వేల మందితో పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆగస్టు–సెప్టెంబర్ వరకు కెఎస్ఐ చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యావాని ఇది నిరంతర పక్రియ అని అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయాని ఎవరు అందోళన చెందవద్దని ఆయన తెలిపారు. ఇప్పటికే రోడ్ల నిర్మాణానికి రూ.600 కోట్లు నిధుల మంజూరైనట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి గ్రూపు విబేధాలు లేవని,మీడియా వాస్తవాలు రాయాలని అపోహాలు సృష్టించవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యాట గీతా, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కానుగుల దశరథం, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు యాట నర్సింహ్మా, జగన్, మానయ్య, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లీ రాములు, ఏఎంసీ డైరెక్టర్ వస్సుల శ్రీశైలం, కేఎస్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణానాయక్, ఖాధర్, విజయ్, డీగ్రీ కృష్ణ, అప్పం శ్రీను, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పస్పులేటి పరమేష్, దుడ్డు కృష్ణ, బద్దీ వెంకటేష్, నర్సింహ్మా తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



**తలకొండపల్లి, మే 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల గ్రామంలో ప్రజా ప్రభుత్వంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ ఘనంగా నిర్వహించారు. కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి,మాజీ ఎంపీటీసీ మల్లి కేడి అంబాజీ,ఉప సర్పంచ్ అజిత్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు బి. నరసింహులు, హిన భాగం, ఆరిఫ్, పులిజాల విష్ణు,గ్రామ పంచాయతీ సెక్రటరీ శరత్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



**మోటకొండూరు, మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించరూ. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ ఏకు సంతోష్ రెడ్డి హాజరై, కేక్ కట్ చేసి, స్వీట్లు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప నాయకుడని, పేద ప్రజల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న ప్రజా నేత అని సైదులు ప్రశంసించారు. ఆయన ప్రజల మనస్సుల్లో నిలిచిపోయే నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నూనెముంతల సంతోష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాడా శశిధర్ రెడ్డి,బొడిగె బిక్షపతి,ఓర్సు యాదగిరి, బచ్చే రాములు,పంతుల భూపాల్, పులి సత్తయ్య,కంచర్ల మధు, పన్నీరు నరసింహ, పంతుల శేఖర్, ఆడపు శ్రీరాములు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండలంలో వేసవి శిక్షణ తరగతులకు



**యాదాద్రి,మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆత్మకూరు మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ తరగతులకు స్థానిక జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు కానుగంటి శ్రీశైలం, కురిమేటి యాదయ్య , ఏం.ఇ.ఓ, మహాదేవ రెడ్డి శుక్రవారం సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం లో పిల్లలకు ఆటపాటలతో కూడిన డ్రాయింగ్ ( చిత్రలేఖనం ) చేస్తూ, క్యారం బోర్డు, రింగ్ బాల్ ,వాలీబాల్ తదితర (ఇండోర్ గేమ్స్) ఆటలను ఆడుకోవడానికి మెటీరియల్తో వేసవిలో పిల్లలు ఎండలో తిరగకుండా ఈతకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని అన్నారు ప్రతీ విద్యార్థి ఉదయము 8.00 గంటల నుండి 11.00 గంటల వరకు విధిగా హాజరై సమయాన్ని సద్వినియోగం చేసుకొని మానసిక ఉల్లాసం మేధా సంపత్తి పెంచు కోవాలన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ శిక్షణ కార్యక్రమం మే 2025 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు చంద్ర మౌళి, ఆలీ, అనంత రెడ్డి, సత్యం, కే. సునీత, మధుసూధన్ రెడ్డి, సత్యం, ఆశ వర్కర్ రాచమల్ల శిరీష పాల్గొన్నారు.

# బీబీనగర్ లో ఘోర ప్రమాదం.. బ్రిడ్జి పైనుంచి కారు బోల్తా

## - ముగ్గురు పరిస్థితి విషమం





**యాదాద్రి, మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట దైవదర్శనానికి వచ్చి వెళుతూ తిరుగు ప్రయాణంలో బీబీనగర్ వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన 8 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను హైదరాబాద్ గాంధీకి తరలించారు.

# సింధూర్ విజయోత్సవ తిరంగ ర్యాలీ




**కల్వకుర్తి, మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ప్రధాన వీధుల గుండా తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో హిందూ,ముస్లిం సోదరా భావంతో పాల్గొంటూ భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తిరంగా ర్యాలీ కమిటీ నిర్వాహకులు,పట్టణ ప్రజలు,ప్రముఖులు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.
అన్నివేళలా మీతో పాటు ఉంటుంది
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.
మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# హోరు వానలో హిందుత్వ జోరు.





- -హిందూ ఏక్తా యాత్ర అద్భుతో: అద్భుతస్య
- -వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చిన జనం
- -కదం తొక్కిన కాషాయ సైనికులు...
- -కాషాయ సైన్యాన్ని ఉగ్రూతలూగించిన బండి సంజయ్ స్పీచ్
- -హిందూ సంస్కృతి ఉట్టిపడేలా కళాకారుల విన్యాసాలు
- -ఆకట్టుకున్న జై హనుమాన్ కళారూపాలు
- -కేరళ, తమిళనాడు, కర్నాటక కళాకారుల అద్భుత ప్రదర్శన
- -ఏక్తా యాత్ర పొడవునా స్వచ్ఛందంగా వ్యాపారుల సేవా కార్యక్రమాలు
- -యాత్ర సక్సెస్ తో ఫుల్ జోష్ లో బీజేపీ శ్రేణులు



**కరీంనగర్, మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఒకవైపు హోరు వాన... మరోవైపు హిందుత్వ జోరు...హిందుత్వం ఉట్టిపడేలా కళాకారుల ప్రదర్శనలు...ఎటు చూసినా యువత జోష్.... వెరసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహించిన హిందూ ఏక్తా యాత్ర సూపర్ హిట్ అయ్యింది. జోరు వానను సైతం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చిన ప్రజలు ఒకవైపు... యాత్ర పొడువునా ఏక్తా యాత్రను తిలకించేందుకు ప్రతి ఇంటి ఎదుట బారులు తీరిన ప్రజలు ఇంకోవైపు... మొత్తంగా బండి సంజయ్ హిందూ ఏక్తా యాత్ర తన రికార్డులను తానే బాక్స్ బద్దలు కొట్టింది. ఇంత జోరువానలో ఎవరొస్తారులే అని భావించిన కుహనా లౌకిక వాదులకు, విపక్షాల నాయకుల ప్రశ్నలకు కాషాయ సైన్యం 'ఏక్తా యాత్ర'తో గట్టి సమాధానమే ఇచ్చింది. గడప లోపలే మా కులం... గడప దాటితే మేం హిందువులం అంటూ చాటి చెప్పారు. ఫలితంగా కరీంనగర్ వీధులన్నీ జన సంద్రమయ్యాయి. పార్టీలను పక్కనపెట్టి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇక ఏక్తా యాత్రలో భాగంగా కళాకారుల ప్రదర్శనలు, కళారూపనల ప్రదర్శనలు, సేవా కార్యక్రమాలు లెక్కే లేదు. కేరళ, తమిళనాడు, కర్నాటక, ఏపీసహా పలు రాష్ట్రాల కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలిచ్చారు. ఇక యువకుల జోష్ కు అంతే లేదు. ప్రతి పాటకు ఉప్పెనలా యువ తరంగం చిందులేస్తూ ప్రజల్లో జోష్ నింపారు. వాస్తవానికి జోరు వాన కురుస్తుండటంతో నిర్ణీత సమయం కంటే కాస్త ఆలస్యంగా "హిందూ ఏక్తా యాత్ర" ప్రారంభమైంది. కరీంనగర్ వైశ్యా భవన్ వద్ద ఏక్తా యాత్ర ప్రారంభం కాగానే వర్షం హోరున కురుస్తోంది. అయినప్పటికీ జనం భారీగా తరలివచ్చారు. ఆ జనాన్ని చూసిన బండి సంజయ్ వారందరికీ హ్యాట్సాఫ్ తెలిపారు. తన ఉద్వేగభరిత ప్రసంగంతో వారిలో మరింత జోష్ నింపారు. అదే సమయంలో ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారత సైన్యం ధైర్యసాహసాలను కొనియాడారు. విపక్షాల విమర్శలకూ ఘాటుగా కౌంటర్ ఇస్తూ కాషాయ సైన్యాన్ని ఉత్తేజపరిచారు. సంజయ్ ప్రసంగం అనంతరం హిందూ ఏక్తా యాత్ర వైశ్య భవన్ నుండి రూరల్ పోలీస్ స్టేషన్, టవర్ సర్కిల్, కమాన్ చౌరస్తా, బస్టాండ్, కమిషనర్ ఆఫీస్, రాజీవ్ చౌక్ మీదుగా తిరిగి వైశ్యాభవన్ దిశగా కొనసాగుతోంది. చిన్నారులు, యువకులతోపాటు మహిళలు, వృద్దులు సైతం బారులు తీరారు. చంటి పిల్లలను ఎత్తుకుని తల్లులు సైతం ఇండ్ల ముందు నిలబడి ర్యాలీని తిలకించారు. వారందరికీ అభివాదం చేస్తూ ముదుకు సాగారు. సాయంత్రం పొద్దుపోయే వరకు యాత్ర కొనసాగుతూనే ఉంది. కాషాయ చీరెలు ధరించిన వందలాది మహిళలు ప్రత్యేక వేషధారణతో డప్పు వాయిద్యాలతో ఆట పాటలతో ర్యాలీకి హాజరైన వారిని అలరించారు. ప్రత్యేక వాహనంపై సీతారామచంద్రులను చేతుల్లో ఎత్తుకుని వెళుతున్న హనుమంతుడి రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణలోని భిన్న సంస్కృతులతో కూడిన వేషధారణలతో మహిళలు, యువకులు ఆట పాటలతో అలరించారు. ముఖ్యంగా చిన్నారులు, యువకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. యాత్ర పొడవునా డ్యాన్సులు చేస్తూ జోష్ నింపారు. దాదాపు 5 కి.మీల పాటు సాగిన ఈ యాత్రలో ఎక్కడా విసుగు అనే పదానికి తావులేకుండా అడుగడుగునా జనం నీరాజనం పట్టారు. చాలా చోట్ల మహిళలు, యువకులు తమ ఇండ్ల ముందు నిలబడి ర్యాలీ రాక కోసం చంటి పిల్లలను పట్టుకుని ఓపికగా వేచి చూడటం కన్పించింది. తమ వద్దకు ర్యాలీ రాగానే బండి సంజయ్ పై పూల వర్షం కురిపిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**మహబూబాబాద్ - మే 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలోని కురవి, సీరోలు మండలాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్.
అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తూ, కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, తూకం విషయంలో పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా, మండల వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# బాలింత మృతిలో శీరిషా ఆస్పత్రిపై మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశం





**నల్లగొండ,మే 23 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
జిల్లాలో వైద్యాధికారుల తీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠి అగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల పనితీరు సక్రమంగా లేదని, వారిలో మార్పు రాకపోతే ఏమాత్రం సహించేది లేదన్నారు. ప్రభుత్వ వైద్యులు రోగులను ప్రైవేట్‌కు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. గత డిసెంబర్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింత రాజేశ్వరి మృతి విషయంలో మిర్యాలగూడలోని శీరిషా ఆస్పత్రిపై మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మాతృ మరణాలపై వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో దామరచర్ల మండలం జైత్రం తండాకు చెందిన ఆడావత్ రాజేశ్వరి కాన్పు కోసం మిర్యాలగూడలోని శీరిషా ఆస్పత్రికి వెళ్లగా అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ శీరిష చివరి నిమిషం వరకు ఆస్పత్రిలో ఉంచుకుని అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి పంపినట్లుగా తెలిపారు. రాజేశ్వరి ప్రసవానంతరం మృతి చెందిందన్నారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన మిర్యాలగూడ శీరిషా ఆస్పత్రిపై మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. రోగుల అవగాహన లోపం, నిర్లక్ష్యం తదితర కారణాల వల్ల మాతృ మరణాలు సంభవించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మొదలుకుని ఆశ, ఏఎన్ఎం, పీహెచ్సీ డాక్టర్లు, సిబ్బంది గ్రామాల్లో గర్భిణీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవం సమయంలో చేయించుకునే పరీక్షలు తదితర అంశాల పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భం దాల్చిన నుండి ప్రసవం వరకు నిరంతరం ఏఎన్సీ చెకస్ తోపాటు ఈడీడీ ప్రకారం సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మధ్యలో ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తినట్లయితే తక్షణమే చికిత్స అందించాలన్నారు. పీహెచ్‌సీలో సాధ్యం కాకపోతే ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయాలని, అంతేగాని ప్రభుత్వ వైద్యులు సైతం అక్కడక్కడ ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు తదితర కారణాల వల్ల ప్రసవం తర్వాత మహిళలు మరణిస్తున్నారని, మరికొన్ని కేసుల్లో చికిత్సలు తీసుకోకపోవడం, పౌష్టికాహాకారం లోపం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని అక్కడ అవగాహన చర్యలు చేపట్టాలన్నారు. ఆశలు, ఆంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు ప్రతి గర్భిణీ ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఎంహెచ్ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృ, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణీ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, సీడీపీఓలు, వైద్యాధికారులు, ఎంపీహెచ్ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## చెట్టు = అమ్మ
## చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# వైద్యులు, డిపార్ట్మెంట్ హెడ్ లు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు అందుబాటులో ఉండాలి

**-అప్పుడే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి**
**-వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**




**వనపర్తి,మే 23( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వైద్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ హెడ్ లు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆసుపత్రి సూపర్డెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫ్ హెడ్స్ లతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో డిపార్ట్మెంట్ ఆఫ్ హెడ్ లు అందుబాటులో లేకపోతే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించలేమనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ఇకనుండి బయోమెట్రిక్ తో పాటు మ్యానువల్ హాజరు రిజిస్టర్ ప్రతినెల తన వద్దకు పంపించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి, మాత శిశు సంరక్షణ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య శాఖలో కొత్తగా నియామకం జరిగిన తర్వాత ఎంతమంది వైద్య సిబ్బంది హాజరయ్యారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకొని ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు రేడియాలజిస్టులు అందుబాటులో వచ్చినందున గర్భిణీలకు టీపా స్కానింగ్ కచ్చితంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులలో మౌళిక సదుపాయాలపై చర్చిస్తూ రోగులకు అవసరందిన వీల్ చైర్ లు, కూర్చోడానికి బెంచిలు మరిన్ని కొనుగోలు చేసే విధంగా ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ప్రతినెల 400 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే విధంగా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్యం పై చర్చిస్తూ ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చినందున జిల్లాలో కంటి పొరలతో ఇబ్బందులు పడుతున్న వారికి శస్త్ర చికిత్సల ద్వారా వైద్యం చేయాలని ఆదేశించారు. ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రచారం కల్పించాలని తెలిపారు. జిల్లాలో చెవి, ముక్కు, గొంతు నొప్పి వ్యాధులతో బాధ పడే వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఎన్ టి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టి ఎస్ ఎం ఐ డి సి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మాత శిశు వైద్య కేంద్రం వద్ద నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ను సాధ్యమైనంతవరకు త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి రోగులతో వైద్య సేవల పై వివరాలు తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాసుపత్రి సూపర్డెంట్ రంగారావు డిపార్ట్మెంటల్ హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

**- పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి**



**షాద్ నగర్, మే23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో షాద్నగర్ డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో, జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ పాపారావు, టి. బి అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వాళ్లు అందజేసిన న్యూట్రిషన్ కిట్లను, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా క్షయ వ్యాధి పేషెంట్లకు పంపిణీ చేయడం జరిగింది అని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కిట్లలో 3 కిలోల గోధుమపిండి, 3 కిలోల బియ్యము, 1 కిలో కందిపప్పు, 1 కిలో పల్లీలు మరియు 1/2 కిలో బెల్లం ఏర్పాటు చేయడం జరిగింది డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. క్షయ వ్యాధి లక్షణాలు ఏమిటి అంటే ప్రజలలో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము మరియు రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి ఉన్నట్లయితే వారికి చేవ్యాధి ఉండవచ్చు అని అనుమానించవచ్చు అని, ఈ పై లక్షణాలు ఉన్నవారు షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి తెమ్మడ పరీక్ష మరియు ఎక్స్రే పరీక్ష చేయించుకున్నట్లయితే క్షయ వ్యాధి ఉందా లేదా అని నిర్ధారించవచ్చునని తెలియజేశారు. తదుపరి షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ క్షయ వ్యాధిగ్రస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, పూర్వము క్షయ వ్యాధి సోకింది అంటే అతను కచ్చితంగా చనిపోతారు అనే అపోహ ఉండెను, ఇప్పుడు అలాంటి భయము ఏమి లేదు అని, క్షయ వ్యాధిగ్రస్తులకు తెలంగాణ ప్రభుత్వము ఖరీదైన ఉచిత మందులను అందజేయడంతో పాటు, ప్రతి పేషంట్ కి, ప్రతి నెల తెలంగాణ ప్రభుత్వము పేషంటు ల యొక్క పోషక హారము కొరకు, ప్రతి పేషెంట్ యొక్క అకౌంట్లో 1000 రూపాయలు జమ చేస్తుంది అని తెలియజేశారు. అందువలన పేషెంట్లు అందరూ కూడా మందులను తప్పకుండా రెగ్యులర్గా తీసుకున్నట్లయితే, వారి యొక్క ఆరోగ్యము బాగుపడి హెల్తీగా జీవనం గడపవచ్చని తెలియజేశారు. ప్రస్తుతము టీ.బీ అలర్ట్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందజేస్తున్న ఈ కిట్లను కూడా పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్చార్జి సూపర్డెంట్ డాక్టర్ విష్ణు , వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ జి శ్రీనివాసులు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆలీబాబా ఖాన్, షాద్నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెంది తిరుప రెడ్డి, టీబీ సూపర్వైజర్లు రవికుమార్, షఫీ, సంధ్య, మరియు ఆరోగ్య సిబ్బంది అన్వర్, లింగం, గౌస్, మరియు కాంగ్రెస్ కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

# ఇక్రిసాట్ పరిశోధనలు ప్రశంసనీయం

**- వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**






**హైదరాబాద్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలోని వ్యవసాయ రంగాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు శాస్త్రీయ పరిశోధనలు ఎంతగానో అవసరమని రైతు కమిషన్ అభిప్రాయపడింది. ఈ మేరకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలోని బృందం గురువారం పటాన్‌చెరులోని అంతర్జాతీయ పంటల పరిశోధనా కేంద్రం ఇక్రిసాట్ను సందర్శించింది. ఆయనతో పాటు కమిషన్ సభ్యులు రాంరెడ్డి, గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు హరి వెంకట ప్రసాద్, సురేష్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పతక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, ప్రిన్సిపల్ సైంటిస్టులు డా. హరికిషన్ సుడిని, డా. జానిలా తదితరులు కమిషన్ బృందానికి స్వాగతం పలికి, కేంద్రంలో జరుగుతున్న ప్రాముఖ్య పరిశోధనలపై సమగ్రంగా వివరించారు. విత్తన పరిశోధన, మెట్టపంటల అభివృద్ధి, మట్టి ఆరోగ్యం, నీటి వినియోగ సమర్థత వంటి అంశాలపై కమిషన్ బృందం ఆసక్తిగా సమీక్ష నిర్వహించింది. శాస్త్రవేత్తలతో చర్చలు జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం మరియు ఇక్రిసాట్ సంయుక్తంగా అమలు చేస్తున్న పలు ప్రాజెక్టుల ప్రగతిని అధికారులతో కలిసి సమీక్షించారు. రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం ఎలా అందుతున్నదీ, ఆయా ప్రయోజనాలు పొలం దాకా ఎలా చేరుతున్నాయన్న దానిపై శాస్త్రవేత్తలు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ, "1972లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నాయకత్వంలో ఈ సంస్థ స్థాపితమైంది. దానికోసం అప్పటి ప్రభుత్వం 3500 ఎకరాల భూమిని కేటాయించింది. నేను ఒకసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, మళ్లీ ఇప్పుడు రైతు కమిషన్ చైర్మన్‌గా ఈ సంస్థను సందర్శించడం గర్వకారణం" అన్నారు. పరిస్థితులు రోజూ మారుతున్న నేపథ్యంలో పంటలలోను, సాగు విధానాలలోనూ సాంకేతిక మార్పులు అవసరమవుతున్నాయని, ఇక్రిసాట్ ఈ అవసరాలను గుర్తించి అమలు చేస్తున్న విధానం అభినందనీయమని పేర్కొన్నారు. సాంప్రదాయ పంటల అభివృద్ధి దిశగా జరుగుతున్న కృషి రైతుల భవిష్యత్తుకు దోహదపడుతుందని చెప్పారు. ఇక్రిసాట్‌తో ముడిపడిన శాస్త్రవేత్తల కృషి, పరిశోధనలు, వాటి ఫలితాలు రైతు సంక్షేమానికి ఎంతగానో తోడ్పడతాయని కమిషన్ అభిప్రాయపడింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలకు ఇది మద్దతుగా నిలుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తపరిచారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో 800ల ఎకరాల ప్రభుత్వ భూమి కి ఎసరు







**రూ.400కోట్ల భూమిని పట్టా చేసిన అధికారులు రాజకీయ నాయకులు**

**- ఇద్దరు కీలక మాజీ మంత్రులు, ఎమ్మెల్యే భాగస్వామ్యం**

**- అక్రమ ధృవ పత్రాలతో పట్టా...**

**- రూ.50లక్షలకుపైగానే చేతులు మారిన వైనం....?**

**- "నీలగిరి ఎక్స్ ప్రెస్" సబ్ ఎడిటర్ అలేటి నవీన్ చేసిన ఇన్వెస్టిగేషన్ లో నిప్పులు చెరిగే నిజాలు**






**యాదాద్రి,మే 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఓ గ్రామంలో గుంట భూమి వున్న దానికి సంబందించి ఖాస్రా రెవిన్యూ రికార్డుల్లో చాలా స్పష్టంగా నమోదు చేసి ఉంటుంది. అయితే ఎక్కడైనా ఒక్క సర్వే నెంబర్ కు ఒకే ఖాస్రా ఉండడం సర్వసాధారణం. కాని ఇక్కడ మాత్రం ఒకే సర్వే నెంబర్కు రెండు ఖాస్రాలు ఉన్నాయి. మరి ఈ ఖాస్రాలను సృష్టించింది ఎవ్వరూ దీన్నీ అమలు చేసింది ఎవ్వరూ ఇందులో పాత్రదారులు ఎవ్వరూ సూత్రదా రులు ఎవ్వరూ ఈ ఖాస్త్రాల సృష్టించడం వల్ల అధికంగా లబ్దిపొందిన అధికారులు ఎవ్వరెవ్వరూ అనే విషయం తేల్సాలిన అవసరం ఎంతైన ఉంది. ఇంత పెద్ద వ్యవహారం జరిగిందంటే ఇందులో పారిశ్రామిక వేత్తల వాటా ఎంత ఉంది రాజకీయ నాయకుల వాటా ఎంత ఉందనే విషయం స్పష్టం కావాల్సిన అవసరం ఉంది. భారీస్థాయిలో జరిగిన భూ అక్రమాలు ఎలాంటి రాజకీయ నాయకుడు పారిశ్రామిక వేతలు ఉన్నత అధికా రుల ప్రమేయం లేకుండా మాత్రం జరగదనేది సుస్పష్టం. అదే సమయంలో ఖాస్రాలో ప్రభుత్వ భూమిగా ఉన్న భూములను సబ్ రిజిస్ట్రార్లు ఎలా రిజిస్ట్రేషన్లు చేశారనేది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇంత పెద్దఎత్తున భూముల బదాలయింపు జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్న సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కూడా తమ చేతివాటం ప్రదర్శించారనే విషయం ఇందులో స్పష్టంగా ఆర్ధం అవుతుంది. మొత్తం మీద ఈ ప్రభుత్వ భూములను ఎవ్వరికీ తోచినట్టు వారు దోచుకుంటూ తిలా పాపం తలా పిడెకెడు అనే నానుడికి నిలివెత్తు నిదర్శనమనే చెప్పాలి.

**- పూర్తి వివరాల్లోకి వెళితే...**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం చల్లూర్ గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 322లో మొత్తం 1575 ఎకరాల భూమి ఉంది. ఇందులో 322/4/అ లో సుమారు 881 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మొత్తం కూడా అప్పట్లో శంకరప్ప, లింగప్పల పేర్ల మీద పట్టా అయి ఉన్నట్లు పాత ఖాస్రా ప్రకారం రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయబడి ఉంది. అదే విధంగా 1975లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన సీల్లింగ్ యాక్ట్ తీసుకురావడంతో అక్కడ వున్న ఈ భూములలో సుమారు 800ఎకరాల భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా సదరు శంకరయ్య, లింగప్ప కుటుంబాలకు 94 ఎకరాల భూమి మిగిలింది. ఇంతవరకు బాగానే ఉండగా 1993 తరువాత ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 800ఎకరాల భూములకు కొత్త ఖాస్రాలు పుట్టురావడం గమనార్హం. ప్రస్తుతం ఈ రెండు ఖాస్రాల్లో ప్రభుత్వ అధికారులు దేని ప్రకారం ముందకు సాగుతున్నారు అనేదే ప్రధాన ప్రశ్న. గతంలో ఒక ఖాస్రా ఉన్న సమయంలో మరో ఖాస్రాలు ఎవ్వరూ సృష్టించారు ఎవ్వరికి మేలు చేసేందుకు సృష్టించారు ఇందులో కేవలం అధికారులు చేత్తి వాటమే ఉందా లేక రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తల ప్రమేయం కూడా ఉందా అనే విషయం స్పష్టం కావాల్సి ఉంది. రెవిన్యూ రికార్డుల్లో ఒక్కసారి ఏదైన రికార్డు తయారు చేసిన తరువాత దాని మార్పు చేయడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ఈ గ్రామంలో మాత్రం రెండు ఖాస్రాలు సృష్టిస్తుంటే ఉన్నత అధికార యంత్రాంగం గతంలో పనిచేసిన తహసిల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్లు ఏం చేస్తున్నారు అనేదే ప్రధానమైన ప్రశ్న. అసలు ఈ ఖాస్రా ఉన్నతాధికారులకు తెలియకుండా వచ్చిందా.? లేదా అందరి ప్రమేయంతోనే వచ్చిందా అనే విషయం ప్రభుత్వ పెద్దలు తేల్చాల్సిన అవసరం ఎంతైన ఉంది. ప్రస్తుతం ఈ 322/4/అలో వున్న వివిధ సర్వేనెంబర్లలో సిలింగ్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ భూములుగా ఉండాల్సిన భూములు మొత్తం కూడా ప్రస్తుతం ఉన్న కొత్త ఖాస్రా ప్రకారం అనేక మంది పేర్ల మీదకు బదలాయించారు. దీంతో అసలు సిలింగ్లో ఉన్న సుమారు 800 ఎకరాల భూమి ఏమైనాట్టో ఆర్థం కాని పరిస్థితి నెలకుంది. ఇలా ఒకే సర్వే నెంబర్లో ఉన్న సుమారు 800 ఎకరాల భూమిని గద్దల్లా అధికారుల సహకారంతో తనుకుపోయి దశాబ్దం గడు స్తున్న అధికారులు మాత్రం అటువైపు కనీసం కనెత్తి కూడా చూడ డం లేదు. ఇప్పటికే ఈ విషయంలో పలువురు జిల్లా కలెక్టరు ఫిర్యాదు చేసిన స్పందనమాత్రం కనిపించకపోవడం ఆశ్చర్యకరం. ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి చేసిన మాయజాలంలో ఈ భూమి వ్యవహారంలో అధికారులు గట్టిగానే తమ చేతివాటం ప్రదర్శించినట్లు చాలా స్పష్టం అవుతుంది. ధరణిలో రికార్డులు నమోదు చేసే క్రమంలోనే ఈ వ్యవహారం జరిగిందా లేదా అంతకంటే ముందే ఈ వ్యవహారం నడిచిందా అనేది విచారణ చేస్తే అసలు విషయం భయటకు వస్తుంది. ధరణిలో భూములను నమోదు చేసే క్రమంలో జరిగిన తప్పులను తవరకు గమనిస్తే భూముల నమోదు విషయంలో అధికారులు చేసిన తప్పులు చాలా స్పష్టంగా ఆర్థం అవుతంది. ఇక్కడే అధికారులు తమ తెలివితేటలను వినియోగించారని చెప్పాలి. పాత సర్వే నెంబర్లలో ఉన్న భమూలను ధరణిలో నమోదు చేసే క్రమంలో వాటిని పార్ట్ పార్టుగా విభజించి ఇష్టానుసారంగా భూముల విస్తర్ణంను పెంచుతూ పోయ్యారు. అయితే ఇది వివిధ పట్టాదారుల పేర్ల మీద నమోదు చేస్తూ ఎవ్వరికీ ఎలాంటి అనుమానం రాకుండా జాగ్రతపడ్డారు. పాత ఖాస్రా ప్రకారం చూసిన కొత్త ఖాస్రా ప్రకారం చేసినా కూడా సర్వే నెంబర్ 322/4/ఐలో ధరణికంటే ముందు 1ఎకరం 30గుంటలు ఉంటే ధరణిలో నమోదు చేసే క్రమంలో దీని వివిధ పట్టాదారుల పేర్ల మీదకు విభజించి ఏకంగా 153 ఎకరాలుగా నమోదు చేశారు. అలాగే 322/4/లూలో 1ఎకరం 15గుంటలు ఉంటే 62 ఎకరాలుగా, 322/4/ఖలో 7ఎకరం 12 ఎకరాలకు బదలుగా 78 ఎకరాలు, 322/4/ఝలో 8ఎకరం 25గుంటలకు 56 ఎకరాలు, 322/4/లులో 10ఎకరం 22 ఎకరాలకు 62 ఎకరాలను నమోదు చేసినట్లు ధరణిలో స్పష్టంగా తెలుస్తుంది. అంటే అక్కడ లేని భూముని అధికారులు ఎలా నమోదు చేశారనే విషయం పై వారే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇంత పెద్ద వ్యవహారంలో భూ బదలాయింపు జరిగితే దీని పై అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్డీఓలకు తెలియదు అని చెప్పడం అంటే అది మన అవివేకమే అవుతుంది. ముఖ్యంగా ఏదో ఒక్కటి రెండు సర్వే నెంబర్లలో తప్పులు జరిగితే సరిపెట్టుకోవచ్చు కాని ఒకే సర్వే నెంబర్లోని పలు సబ్ సర్వే నెంబర్లలో ఇంతటి భారీ స్థాయిలో అది కూడా ఏకంగా వందల ఎకరాల భూ బదలాయింపులో తప్పులు జరిగాయంటే మాత్రం అందులో అధికారుల స్థాయి నుండి రాజకీయ నాయకుల చేతివాటం ఏ స్థాయిలో ఉందనే విషయం ఎవ్వరికైన ఇట్టే ఆర్థం అవుతుంది. ధరణి తెలంగాణ పమత్వం ఎవ్వరికీ ఎలాంటి అనుమానం రాకుండా కార్డు తయారు కాదు. పనీఈలు సృష్టిస్తుంటే తహసిల్దార్, ఏమైన ప్రశ్న వచ్చిందా ఇప్పటికైన ప్రభుత్వం ఈ భూ వ్యవహారంలో దృష్టి సారిస్తే సుమారు 800 ఎకరాల భూమి కబ్జాకోరుల చేతుల్లో నుండి విముక్తి లభించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా వీటి మార్కెట్ ధర కూడా ప్రస్తుతం సుమారు రూ.400కోట్లకు పైగా ఉండడంతో ఈ స్థలం ప్రభుత్వంకు అనేక రకాలుగా ఉపయోపగే అవకాశాలు లేకపోలేదు. ఈ భూ వ్యవహారం పై మరింత పూర్తి సమాచారంతో మరో కథనంతో నీలగిరి ఎక్స్ ప్రెస్ మీ ముందుకు తీసుకురానుంది.

# మోగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా

**జూన్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ, జూలైలో సర్పంచ్ ఎన్నికలు జరగనున్న సూచనలు**




**నాగర్ కర్నూల్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో రాజకీయం మళ్లీ ఉత్కంఠభరితంగా మార్చబోతున్నది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాజకీయ రంగం వేడెక్కుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 18 నెలలు పూర్తవుతున్నా, ఇప్పటివరకు గ్రామీణ పాలనకు ప్రాణం పోసే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కల్పించకుండా కాలం గడిపినందుకు ప్రభుత్వం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ లోపాన్ని ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగం చక్కబెట్టే ప్రయత్నంలో నిమగ్నమవుతున్నట్లు సమాచారం. తాజా వివరాల ప్రకారం, జూన్ 10వ తేదీ లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాల వారీగా ఏర్పాట్లకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇదే సమయంలో రాజీవ్ వికాస్ పథకం కింద లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఈ పథకం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు ఎన్నికల ముందు ప్రభుత్వానికి అనుకూల వాతావరణం సృష్టించవచ్చన్న గమనికతో ప్రభుత్వం ముందడుగు వేస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, జూలై నెలలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే యోచన ప్రభుత్వం ముందుంచినట్లు తెలిసింది. దీనితోపాటు అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పటినుంచే సన్నద్ధమవుతున్నాయి. ప్రజల్లోకి వెళ్లి తమ హామీలను వివరించేందుకు, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి నాయకులు గ్రామాల పట్ల దృష్టి సారిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు తనదైన వ్యూహాలతో ప్రజల్లోకి చేరుతున్నాయి. ఒక్కో నాయకుడు తనకు అనువైన పార్టీ గుర్తు కోసం మద్దతుదారులతో చర్చలు సాగిస్తున్నారు. కొందరు ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఊర్లలో ఎన్నికల చర్చలు మొదలయ్యాయి. వర్గీయ నాయకత్వ పోటీలు తెరమీదకొస్తున్నాయి. ప్రజలు గతంలో ఇచ్చిన హామీల అమలు స్థితిని, నాయ?? నడవడికను పరిశీలిస్తూ కొత్త నాయకులను గెలిపించాలని అభిప్రాయపడుతున్నారు. ఏ నాయకుడు నిజంగా ప్రజల కోసం పనిచేస్తాడో, గ్రామాభివృద్ధికి తన బాధ్యతను నిర్వర్తిస్తాడో అనే ప్రశ్నలపై చర్చ మొదలైపోయింది. మరోవైపు పార్టీలు మాత్రం పలు వాగ్దానాలతో ప్రజల మద్దతు కోసం పోటీ పడుతున్నాయి. గ్రామాల్లో ఎన్నికల వేడి మొదలైపోయింది. చిన్నచిన్న సమావేశాలు, ఇంటింటా ప్రచారాలు, పోస్టర్ల రాకతో ఊర్లు రాజకీయ వాతావరణంలోకి అడుగుపెడుతున్నాయి. ప్రజలు తమ ఓటుతో సరైన నాయకుడిని ఎంచుకోవాలని భావిస్తున్న ఈ తరుణంలో, ప్రతి ఓటు విలువైనదిగా మారుతున్నది. ప్రజాస్వామ్య పండుగకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఈసారి ప్రజలు మరింత తెలివైన నిర్ణయం తీసుకుంటారని ఆశిద్దాం.